గొప్పోళ్ళ రాజ్యం

మరువాడ రాజేశ్వరరావు

ఫేక్టరీ సైరను ఊదగానే జనం బిలబిలా పైకొచ్చి హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఒకర్నొకరు తోసుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ ఉషారుగా కొందరు నడుస్తున్నారు. రాఁవులు నీరసంగా నడుస్తున్నాడు. అతని మొహం విచారంగా ఉంది. కళ్ళల్లో ఏదో బాధ....

"ఏఁ ఎలాగున్నావు. రాఁవులూ?" అన్నాడు వీరయ్య. అతని భుజంమీద చెయ్యివేస్తూ.

"రంగికి జబ్బుచేసింది క్షయరోగఁవంట! ... సచ్చిపోద్దేఁవో?...."

అతని గొంతులో భయం.

రాఁవులుకీ, వీరయ్యకీ మంచి స్నేహం.

వీరయ్య చదవగలడు. కొన్ని తెలుగు పుస్తకాలు చదివేడు. రోజూ న్యూస్ పేపరు చదువుతాడు. మంచి ఆలోచన, తెలివితేటలు ఉన్నాయి. తనకి తెలిసిన విషయాలన్నీ రాఁవులుకీ, తోటివర్కర్లకీ చెప్తాడు. అందుచేత అతనంటే వాళ్ళందరికి గౌరవం ఉంది.

ఆ రోగం వొచ్చిన వాళ్ళందరూ చచ్చిపోరని రాఁవులుకి ధైర్యం చెప్పేడు. వైద్యశాస్త్రం బాగా పెరిగిందన్నాడు. ఎలాంటి రోగాలకీ మందులు కనిపెట్టేస్తున్నారన్నాడు. అని, ఒక్కసారి చికాకుపడ్డాడు

"యేట్నాఁటం రాఁవులూ? ఏఏ శాస్త్రాలెంతెంత పెరిగినా, కష్టపడేవోడికెందుకూ పనికిరావు. మనంపడే కష్టంకొద్దీ జబ్బులొస్తాయి రాఁవులూ! కష్టంకొద్దే దరిద్రఁవూనూ. ఇది గొప్పోళ్ళ రాజ్యం రాఁవులూ. నీలాంటి నాలాంటి పేదోడికి రోగాలూ. చావులూ వేగొస్తాయి. రోగం, చావూవొస్తే నీకూ నాకూ దిక్కులేదు. ఆ మద్ది వెంకన్నపంతులుగారి మనవడికీ ఇదే జబ్బుసేసింది. ఎందుకు సేసిందనడుగు.

సిగరెట్లు తాగేవోట్ట. సీసాలకొద్దీ సారా తాగేసేవోట్ట. మరి నీరంగి కెందుకొచ్చింది? తిండిలేనందు కొచ్చింది. పోనీ, లేదన్ను. ఆ ఉన్నతిండి అడిపడిన కష్టానికి సాల్లేదు. నీర్సంమీదొచ్చింది. ఆర్నెల్లు రెస్టూ. ఆరారా తిండీపడేసనికి.... ఆ యెంకన్న పంతులు గోరి మనపడిప్పు డెలాగున్నాడో నీకు తెలీన్దికాదు రంగికేపెడతావ్? బోల్డు డబ్బు ఖర్చౌతుంది రాములూ. ఎక్కడ్నించి తెస్తావు?"

"కష్టపడతాను" అన్నాడు రాములు బింకంగా.

"అవును మరి, యిన్నాళ్ళు కాలుమీద కాలేసుక్కూర్చున్నావు కదా. ఇకమీద కష్టపడతావు?"

ఆ అనడంలో హేళనేకాదు. కొంచెం బాధకూడా ఉంది.

పొద్దున్న ఎనిమిది నించీ, సాయంత్రం అయిదు గంటల్దాకా ఎంత ఎక్కువ పని పిండడం సాధ్యమో, అంతా పిండుతారు ఫేక్టరీవాళ్లు. పనివాడు చావకుండా, బతక్కుండా ఉండడాని కెంత జీతం ఇవ్వాలో అంతే ఇస్తారు. బతకడానికి పనిచేద్దామని అందులోకి వెళ్ళిన ప్రతివాడూ, పని చెయ్యడానికే బతుకుతూ ఉంటాడు.

రాములింకా ఎంత కష్టపడగలడో వీరయ్యకి బోధపడలేదు. రాములుకీ బోధపడలేదు. అయినా, ఏదో ఒకటిచేసి రంగిని కాపాడుకోవాలని ఉందతనికి.

రంగి అతని జీవితం

ఎవరేనా, ఏదో 'ఆశ' ఉంటేనే కష్టాలు భరిస్తారు.... రంగి అతని ఆశ: రంగిని చూస్తున్నంతసేపూ, ఈకష్టాలు రేపుకాకపోతే మరోరోజుకేనా పోతాయనిపిస్తుందతనికి.

రంగిని బతికించుకోడానికి ఏం చెయ్యడానికేనా అతను సిద్ధమే.

* * *

నాలుగు రోజుల తరవాత ...

రాత్రి ఎనిమిది దాటేక. 'రాములూ' అంటూ వచ్చేడు వీరయ్య.

గంజి తాగి, చెయ్యి కడుక్కుని వీధిలోకొచ్చేడు రాములు.

"సుబ్బరాజు గారింట్లో ఆళ్ళ పాప నాడించనందికీ, మొక్కలకి నీళ్లొయ్యడానికీ, అప్పుడప్పుడు గొప్పులయీ తవ్వడానికీ మనిషికావాల్ట. చేసుకుంటావా?"

"అక్కడెవుడో పనిచేస్తున్నాడు గాఁవాల?"

"ఆ గుంటడ్ని మానిపించినారు, ముందు పర్మిసనడక్కుండా రెండ్రోజులు సెలవుపెట్టేసేడు. పాపఁవేదో ఏక్సిడెంటైందంట... ఆళ్ళకేటి, ఆళ్ళమాటే సెల్లుబడై పోవాలి. ఆయమ్మ కోపఁవొస్తే తిరుగుండదు... పోన్లే, నువ్వుచేస్కో. నీ అవసఁవూ తీరుతుంది......"

సుబ్బరాజు పెద్ద కంట్రాక్టరు. కొన్ని కంపెనీల్లో షేర్లు, ఒకటి రెండు ఫేక్టరీల్లో వాటాలు, అద్దెలకి నాలుగైదు ఇళ్ళు. ముప్పై నలభై ఎకరాల ఇళ్ళ స్థలాలు, చిన్నచిన్న వ్యాపారాలు కూడా ఉన్నాయి. ఆయనకో 'ముద్దొచ్చే' భార్య. ఆమెవల్ల ఓ ముద్దుల కూతురు ఉన్నారు. కూతురికి అయిదేళ్లుంటాయి.

వాళ్ల 'స్టేటస్'కి తగ్గట్టు తరుచుగా సాయంత్రం పూట పార్టీలు, కచేరీలు, మీటింగులు, ఫంక్షన్‌లు, సినిమాలు, — అలాంటి ఎంగేజ్‌మెంట్సు చాలా ఉంటాయి. అన్నిటికీ పాపని తీసుకెళ్ళడం పడదు.

మర్నాటినించీ పనిలోచేరి పోయేడు రాఁవులు. అడబ్బు రంగి వైద్యానికే ఖర్చు పెట్టాలనుకున్నాడు రాఁవులు.

ఎంత డబ్బో?....

నలభై రూపాయలు!

* * *

దూరాన్నించి చూస్తే దీపాలతో భగ్గున మండిపోతున్నట్టుందా మేడ. దగ్గరగా వెళ్తే మేడలో ఉరుకులు, పరుగులు.... పైకి, కిందికి....

'వేణ్ణీళ్ళు!'

"ఫేను కొంచెం తగ్గించండర్రా...."

"డాక్టర్!... డాక్టర్!....

"ఎవర్రా అక్కడ? రాఁవులూ!.... వేగంవెళ్ళి, ఈమందులు కొనుక్కురా.... వెంటనే రావాలి....".

అరుపులు.... కేకలు... ఆందోళన

784

సుబ్బరాజుగారి ఒక్కగా నొక్క కూతురికి సాయంత్రం ఏదో జ్వరం వచ్చింది. రాత్రయేసరికి ఎక్కువైంది. పనిపూర్తిచేసుకొని ఇంటికి పోబోతున్న రాఁవులు చేత డాక్టర్ని పిలిపించేరు. అప్పుడొచ్చిన డాక్టరు అర్ధరాత్రయేదాకా కదల్లేదు.

దూరంగా చర్చిలో రాత్రి రెండు గంటలు కొట్టిన కొంతసేపటికి....

డాక్టర్ మొహాన చిరునవ్వు.... ఇంటిల్లిపాదికీ సంతోషం

"షి విల్ బి ఆల్‌రైట్".

తేనెజల్లు లాంటి మాటలు.... డాక్టర్ ప్రసాదరావు మాటలు చాలామందికి అంతే। ఆయన చేతి చలవగొప్పది.

వాడవలసిన మందుల లిస్టు,

'డైయట్'— ఏది తినిపించాలో, ఎంత తినిపించాలో, ఏది తినిపించకూడదో ....అదోలిస్టు।

సుబ్బరాజు భార్య ఇంగ్లీషులోనూ తెలుగులోనూ కూడా నాలుగైదుసార్లు కృతజ్ఞతలు చెప్పుకుంది.

"అబ్బే ... ఇది నా డ్యూటీ" అని నాలుగైదుసార్లన్నాడు డాక్టరు.

డాక్టరు కార్లో కూర్చున్నాక ఆయన బేగ్ భద్రింగా కార్లోకి చేర్చేడు రాఁవులు. కారు వెళ్ళిపోయింది.

ఈయనోసారి రంగినికూడా చూస్తే బాగుండు ననిపించింది రాఁవులుకి. సుబ్బరాజు భార్యకన్నా ఎక్కువగానే కృతజ్ఞత చూపించగలడు.... జీవితాంతం ఆయనపేరు చెప్పుకుని....

కాని, డాక్టరు 'డ్యూటీ'కి డబ్బుతో ముడిపడింది. అది కొనుక్కునే తాహతు రాఁవులుకి లేదు.

తెలతెలవారుతుండగా ఇంటికి బైల్దేరేడు రాఁవులు.

నిద్రలేక ఎర్రబడ్డ కళ్లు,

నిద్రలేని నరాల అలసటతో తడబడే అడుగులు....

ఎనిమిదో గంటకి ఫేక్టరీలో ఉండాలి.

నడక జోరు హెచ్చింది.

గుడిసెల ఇరుకు సందుల్లోంచి నడుస్తూ..... ఒక సందులో, ఒక గుడిసెలోకి వంగి దూరేడు.

ఎదురుగా, ఆందోళనతో రెప్పపడని చూపులు ... రంగి రాత్రి నిద్రపోయి నట్టులేదు.

"అమ్మాయిగోరికి శానా జబ్బు సేసీసింది. ఎవులికీ కంట్లో కునుకునేదు.... రాత్రికి నన్నుండిపోమన్నారు. పెద్దోరు.... కాదంటే బాగోదని, ఉండిపోనాను...." అంటూ, రంగి పక్కనే నులకమంచం మీద కూర్చుని, పీపు నిమురుతూ,

"ఎలాగుంది రంగీ?" అన్నాడు.

రంగి మాటాళ్ళేదు. అతనివంకే కళ్లప్పగించి చూస్తోంది. అయాసపడుతూ, అప్పుడప్పుడు సన్నగా మూలుగుతూ.... చూస్తోంది!

ఆ చూపుల్లో రోజురోజుకీ దగ్గిరవుతున్న చావు— నిరాశ!

బైటికెళ్ళి చన్నీళ్ల స్నానం చేసేడు రాఁవులు. ఫేక్టరీకి వెళ్ళేముందు రంగికి మందువేసి, ఎనిమిదేళ్ళ పెద్దకూతుర్ని నిద్రలేపి,

"అమ్మని, తమ్ముళ్ళని సూసోక్క?" అనిచెప్ప వెళ్ళిపోయేడు, పక్క సందులో కలిసిన వీరయ్యతో కష్టసుఖాలు చెప్పుకుంటూ.

"గొప్పోళ్ళకి రోగాలొస్తాయా అని చూస్తూ ఉంటారు డాక్టర్లు, మందులషాపో ళ్ళూనూ! రోగఁవొచ్చినా, రొష్టొచ్చినా, పండగొచ్చినా, పెళ్ళొచ్చినా ఆళ్ళకి బాగానే జరుగుద్ది... మరి నువ్వూ ఉన్నావుకదా. రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా, నీ పెళ్లానికి మందులుకొంటే తిండుండదు. తిండుంటే మందులుండవు...." అన్నాడు వీరయ్య.

"పోరా, గొప్పోళ్ళంటే నాకుమరీ మంటెక్కువ ... రోగఁవొస్తే. గొప్పైనా పేదేనా వొకటే కదా... అంత ముద్దొచ్చేపిల్ల— బతకూడదని మనఁ వనుకుం టాఁవా? మనకి జరగలేద నేడవాలిగాని, ఆళ్ళకి జరిగింద నేడుస్తాఁవా?" అన్నాడు రాఁవులు.

వాళ్ళిద్దరికీ అదే తేడా!

ఇది గొప్పోళ్ళ రాజ్యఁవంటాడు వీరయ్య.

786

అదెలాగో ఎంతకీ అర్థంకాదు రాఁవులికి. గాంధీబాబు, నెహ్రూబాబు తెచ్చిన సొరాజ్జెఁపన్నా, వోట్లడుక్కునీ కాంగ్రెసోళ్ళ రాజ్జెఁవన్నా— అంతా 'మన' రాజ్యఁవేనని అతని అభిప్రాయం. పాకీస్తానుతో యుద్ధం వొచ్చినప్పుడు దేశభక్తికొద్దీ అయిదు రూపాయ లిచ్చేడుకూడా.

రంగి రోజురోజుకీ హరించుకుపోతోంది అదిచూసి బాధపడడాని క్కూడా తీరికలేనంత పనివొత్తిడిలో పడిపోయేడు రాఁవులు.

ఓ సాయంత్రిం ...

సుబ్బరాజు, భార్య— ఎవరింటికో డిన్నర్‌కి వెళ్ళేరు. ఇల్లు జాగ్రిత్తగా చూసుకోమని, పిల్లని ఆడించమని, వెయ్యి జాగ్రిత్తలు చెప్పి, చేతికి పాలసీసా, కొన్ని ఆటబొమ్మలు యిచ్చి, అంతగా అవసరమైతే ఫలానా నెంబరుకి పక్కింటినించి ఫోన్ చెయ్యమని చెప్పి, వెళ్ళిపోయిందావిడ.

రాత్రి ఏడున్నరదాటి ఎనిమిది దగ్గరవుతోంది. కథలుచెప్తూ, పాపని నవ్విస్తున్నాడు రాఁవులు.

ఇంతలో,—

"ఓ ...రి రాఁవులో. రంగి సచ్చిపోనాదిరో బాబూ ..." అని అరుస్తూ, ఏడుస్తూ పరుగున వచ్చిందో ముసిలమ్మ

రాఁవులుకి ఒక్కక్షణం ఏమీ తోచలేదు.

"రంగి సచ్చిపోనాదిరో" ...

రెంపకాయ తగిలినట్టు నిజం అర్థఁవైపోయిందతనికి. పాపని భుజంమీద వేసుకుని, పెద్దపెద్ద అంగలేసుకుంటూ ఇంటివేపు పరిగెద్దేడు.

రాళ్లు తన్నుకుంటూ, గతుకుల్లో తూలిపడబోతూ, దారిలో మనుషుల్ని తోసుకుంటూ, గాభరాగా పరిగెద్దేడు వొంట్లో రక్తంకూడా అలాగే పరిగెడుతోంది. నరాలు వొణుకుతున్నాయి. పెదిమలు అదురుతున్నాయి.... గుడిసె ముందున్న పదిహేను, పాతికమంది జనంలోంచి గుడిసెలోకి దూరేడు.

లోతుకిపోయిన కళ్ళు భయంకరంగా తెరుచుకున్నాయి. ఏదో అనబోతున్నట్టు నోరు తెరుచుకుని ఉండిపోయింది.

చేతిలో ఉన్న పిల్లని మెల్లిగా కిందికి జార్చేస్తూ, శవంవేపు వెర్రిగా చూసేడు రాములు. శవం చేతిని తనచేతుల్లోకి తీసుకుని, 'రంగీ' అన్నాడు. ....గుండెలోతుల్లోంచి వచ్చిన సన్నని ధ్వని। రంగి పలకలేదు.

సుబ్బరాజు పాప, ఆ గుడ్డిలైటు వెలుగులో కళ్ళుపెద్దవి చేసుకుని చుట్టూ చూసింది. అటువంటి స్థలాన్ని, మనుషుల్ని ఇదివరకెప్పుడూ చూడలేదా పాప

గుడ్డి వెలుగులో మట్టినేలమీద.... కమ్మల గుడిసెల్లో... బట్టలే లేనట్టున్న మనుషులు . మట్టివాసనవేసే జిడ్డుమొహాలు . దుఃఖం, విచారం.

ఇవన్నీ ఇన్నాళ్ళూ ఆ పాపకి తెలీవు, తనని రోజూ ఎత్తుకుని ఆడించే, నవ్వి, నవ్వించే రాములుని అంత దీనత్వంలో ఎప్పుడూ చూడలేదా పాప.

చూసిన తరవాత గాభరాపడి 'కేర్' మని ఏడిచింది— వాళ్ళందరి కోసంవూ ఏడుస్తుందో, రాములు దీనత్వానికి బాధపడే ఏడుస్తోందో, భయంకొద్దీ ఏడుస్తోందో...

ఏడుస్తున్న పాపని బైటికి తీసుకుపోయేడు వీరయ్య

పాపని తీసుకొచ్చిన వీరయ్యని చూస్తూ,

"ఆదొంగ రాస్కెల్‌ని రమ్మను. వాడిపనిచెప్తాను. మా బేబీని ఆ మురికివెధవ పేటలోకి తీసుకెళ్తాడా। వాడి చర్మం వొలిపించేస్తాను .." మండిపడ్డాడు సుబ్బరాజు.

అంతటి మనిషికీ, వీరయ్య చూసిన, 'చూపు' చూస్తూనే రక్తం గడ్డకట్టినట్టై పోయింది.

మరోమాట మాట్లాడకుండా, చరచరా నడిచి వెళ్ళిపోయేడు వీరయ్య.

* * *

వీరయ్య వెళ్లిపోయేడు.

'గొప్పోళ్ళ రాజ్యం మీద యుద్ధం చేసి, పేదోళ్లరాజ్యం తెస్తానం'టూ వెళ్లి పోయేడు.

788

వెళ్ళేముందు...

విచారంతో, కాళ్ళూ చేతులూ ఆడక చతికిల పడిపోయిన రాంవులుని చూసి అతనన్న మాటలు...

"రాంవులూ! నువ్వు రాత్రీ పగలూ కష్టపడి నీపెళ్ళాన్ని బతికించుకోవాలనుకున్నావు. నువ్వు తిండిమానేసి నీ పెళ్లాన్ని బతికించుకోవాలనుకున్నావు. కాని, రాంవులూ! నీ ఆకలి మరోగొప్పోడ్ని పెంచడానికేగాని, నిన్నూ, నీ పెళ్లాన్నీ, నీ పిల్లల్నీ బతికించుకోడానిక్కాదు. నీ కష్టంవంతా ఇంకోడు భోంచేసేదేకాని నీవాళ్లని నీకు దక్కించేదికాదు. ఎంత కష్టపడినా, ఎన్ని దేవుళ్ళకి మొక్కుకున్నా మన దరిద్రం తీరేదికాదు. నిన్న నీపెళ్ళం రోగంతోచచ్చింది. ఇన్నాళ్ళూ అకలికి మాడిమాడి నువ్వు మాత్రిం బాగున్నావా? నీకూ, రేపోమాపో ఏదో పెద్దరోగంవే వొస్తుంది. నీ పిల్లలు ఆకలికి మాడి మాడి శవాల్లాగ బతుకుతారు. నీపిల్లల పిల్లలు ఆ పిల్లలపిల్లలు .. రాంవులూ! కష్టపడే వాళ్ళజాతి జాతంతా ఇలాగే రోగాల్తోనూ, ఆకలితోనూ చావక తప్పదు. నీ తాతలూ, తాతల తాతలూ ఇలాగె చచ్చేరాంవులూ! నీ పిల్లల గతీ అంతే .. కాదు రాంవులూ! ఇలా జరగడానికి వీల్లేదు. మనం ఇన్నాళ్ళూ ఊరుకున్న పాపానికి శిక్ష ఈ గొప్పోళ్ళ రాజ్యంలో ఇన్నాళ్ళూ అనుభవించేం రాంవులూ. ఇంక ఆ పాపం మరి చెయ్యొద్దు. ఇంకా శిక్షలు అనుభవించొద్దు. మన చెమటతో, రక్తంతో మన శవాలమీద గొప్పోడు మనచేతే కట్టించుకున్న మన రాజ్యాన్ని మనం గెల్చుకుందాం రాంవులూ... మన పిల్లలకోసం, మనపిల్లల పిల్లలకోసం యుద్ధం చేద్దాం రాంవులూ బతకమను గొప్పోడ్నీ బతకమను. ఆడూ మనిషే. మరి మనిషిలాగ బతకమను? మన శవాలమీద కాదు, మనతోకలిసి బతకమను? మనరక్తం తాగికాదు మనతో రక్తం పంచుకు బతకమను. మన కష్టం భోంచేసికాదు. మనతో కష్టాన్నీ, తిండినీ పంచుకు బతకమను? మన్నిచంపి ఆడు బతుకుతానంటాడా? కాదు, ఆడ్ని చంపే మనం బతుకుతాం. నేనెళ్తున్నాను రాంవులూ. యుద్ధానికెళ్తున్నాను .. వెళ్తున్నా రాంవులూ... తప్పకుండెళ్తాను..."

ఆ మాట్లాడింది వీరయ్యకాదు. అతని గుండెల్లో రగుల్తున్న మంట...

అతను మాట్లాడేక రాంవులేమీ అనలేదు. ఎర్రబడ్డ కళ్ళతో చీకటిని చీలుస్తూ ఎటో చూస్తున్నాడు దుఃఖం, విచారం కొంత తగ్గేయి... వీరయ్య మాటలు కొద్ది

789

కొద్దిగా తలకెక్కుతున్నాయి. ఆ పరధ్యానంలో వీరయ్య ఎప్పుడెళ్లిపోయిందీ గమనించలేదు.

రంగి... చావు... ఆశ ! చచ్చిపోయింది.

'పిల్లలు .. పిల్లల పిల్లలు... గొప్పోళ్ళ రాజ్యం .. యుద్ధం... యుద్ధం .. యుద్ధం...'

ఆ మాటలు అతని బుర్రలో గింగురుమంటున్నాయి. ఈ యుద్ధానికి అయిదు రూపాయలు కాదు... తన ప్రాణాలే ఇచ్చేయాలనిపిస్తోం దతనికి. అమ్మ లేనందుకు దీనంగాచూస్తూ కూర్చున్న పిల్లల్ని చూసినప్పుడు... అతని పట్టుదల మరింత ఎక్కువయింది.

ఓరిమి, ఓరిమి గాడిదల సుగుణం. ఇతరులుపెట్టే బాధలకి లొంగి సహించి, ఓరిమితో పడివుండడం, మానవుడ్ని దహించేస్తుంది. ఓరిమి నిప్పులా ఆశ్రియమిచ్చినవాళ్ళను దహించేస్తుంది, ఓరిమికలిగి వుండండనే వాళ్లు ప్రజల్ని కన్నుగప్పి గాడిదలుగా చేద్దామని చూస్తున్నారన్నమాట,

— మాక్సింగోర్కీ

790